# ఋణగ్రస్తుడు




"కర్మణ్యేవాధికారస్తే
మా ఫలేషు కదాచన . . ."

వ్యాసపీఠంమీద భగవద్గీత పేజీ తిరగేస్తూ తృప్తిగా నిట్టూర్చారు రామయ్యగారు. బుద్ధి తెలిసే నాటికి మురుగువాడ కింద నాలుగెకరాలు తమకు భుక్తమైన పిత్రార్జితం. చితికిపోయిన కుటుంబం నించి శాంతమ్మను కోరి వరించాడు. ఇంగ్లీషు చదువులు చదవకపోయినా డొక్కశుద్ధి ఉన్నవారు కనక లోకం తీరుతెన్నులు ఆకళింపుచేసుకుని భార్య సహాయంతో చెమటఓడ్చి మట్టిమోసి మురుగు గుండం పూడ్చి పొలాన్ని బంగారు పంట భూమిగా మలుచుకున్నారు. దేవుడు చల్లగా చూచి ఒక కూతుర్ని, ఒక కొడుకును ప్రసాదించాడు. తిండి ఇచ్చిన తల్లి కృష్ణవేణిపేర కూతుర్ని, ఆ నదీతీరాన వేంచేసి తమకు సంతానం ప్రసాదించిన శ్రీ వేదాద్రి వెంకట నృసింహస్వామి పేర కుమారుణ్ణి పిలుచుకుని ఆనందిస్తూంటారు రామయ్యగారు. ఆ బిడ్డలిద్దరు ఆయన కళ్ళు!

"బాబుగారూ!" వీధి వాకిటనుండి వినిపించిన పిలుపుతో ఆలోచనలకు అంతరాయం కలిగి "రా, నారాయణా, రా" అన్నారు రామయ్యగారు కళ్ళజోడు ముడిచి కేసులో భద్రపరుస్తూ.

"నమస్కారమండీ!"

"నమస్కారం, కూచో. శాంతా, నారాయణ వచ్చాడు, పాలు తీసుకురా. ఆఁ, ఏమిటి విశేషాలు? గొడ్డూ బిడ్డా కులాసేనా?" ఆగంతుకుణ్ణి పరామర్శించారు రామయ్యగారు.

"కులాసే, బాబుగారూ, తమ దయవల్ల."

"పరమేశ్వరుడి దయ. అన్నట్టు అమ్మడు కాపరాని కెళ్ళింది కదూ?"

"చిత్తం. ఆ విషయంలోనే కొంచెం పొరపాటు చేశానండి. అదే ఇప్పుడు నా మెడకు గండకత్తెరైంది. ఎటూ తోచక ఉన్నపళంగా తమ దగ్గిరికి పరిగెత్తుకొచ్చాను. పెద్దవారుకదా, ఏదన్నా దారి చూపించక పోతారా అన్న ఆశతో."

"సరిపో! రోట్లో తలదూర్చానంటావు!! ముందు పాలు తాగు, తరవాత తాపీగా మాట్లాడుకుందాం." భరవసా ఇచ్చారు రామయ్యగారు, శాంతమ్మ తెచ్చి ఇచ్చిన పాలగ్లాసు చేతికందిస్తూ.

"శాంతమ్మ పిన్నిగారి చేతి పాల రుచి జన్మలో మరిచిపోలేం. చల్లని మీ మాటలతోనే నా కడుపు నిండిపోయింది."

"చాల్లేవోయ్, నేర్చావ్ పొగడ్తలు! తీసుకో పాలు" అని సాదరంగా పాలు తాగించి, "ఇప్పుడు చెప్పు నీకు వచ్చిన అవాంతరమేమిటో" అడిగారు రామయ్యగారు.

"మరేంలేదు గాని, బాబుగారూ! అమ్మడికి అత్త వారు పెట్టిన నగలమ్మి పొలం కొన్నాను, పంట రాబడి మీద నాలుగేళ్ళలో తీర్చలేనా అన్న ధీమాతో. నీటి ఎద్దడివల్ల సరిగా దిగుబడికాక పైకం తగినంత కూడబెట్టలేకపోయినాను.

"అయ్యయ్యో, స్త్రీ ధనం వాడుకున్నావూ? పొరబాటే చేశావోయ్!"

"చిత్తం. నగలు తెచ్చి గడప తొక్కమని అమ్మణ్ణే

కన్నీరు తుడుచుకుంటూ శాంతమ్మ.

"ఏంలేదు. అల్లుడి చదువుకు లోగడ ఒప్పుకున్న కారణంగా పదివేలు కట్టాలి. భయంలేదు. విచారపడకు. ఋణగ్రస్తులమై చావవలసిన పనిలేదు. బంగారం పండే పొలం. ఎంత తక్కువైనా ఎకరం ఐదువేలు పలక్కపోదు. మన కష్టార్జితం మన బిడ్డలకు చెరిసగం పంచామనుకుందాం. నేను చేసే చివరి శుభకార్యం ఇదే. ఇదే నాకు పెద్ద పండగ!" అంటూండగా "అంత మాటనకండి" అని చేతిసంజ్ఞతో మాట అడ్డుకున్నది శాంతమ్మ.

"మరేం భయపడకు. మాట తొందరలో నోరు జారిందంతే. ఉక్కుపిండం. మరి యాభై యేళ్లదాకా ఈ బొందికేఆపదా రాదు. పాపీ చిరాయుః" అని నవ్వి ఇంకా ఇలా అన్నారు రామయ్యగారు.

"బాబూ, నరసింహం! అనుకోకుండా నీ కన్యాయం చేశాను. అక్కయ్యను ఇంగ్లీషు చదువుకున్న అల్లుడి కిచ్చి చేతామన్న ఉబలాటంతో, నువ్వు పొలంపట్టుకుండి ఇల్లు నిలబెడతావని పై చదువులు చెప్పించలేదు. నిన్ను చదువుకూ, ఆస్తికీ రెంటికీ చెడినవాణ్ణిగా చేస్తానని కలలోకూడా అనుకోలేదు. ఇప్పుడు నా మెడ పుచ్చు పూర్తిగా బిగుసుకుంది. నా చేతులు కట్టుబడ్డాయి."

కొడుకును దగ్గరికి తీసుకుని కలతపడ్డారు రామయ్యగారు.

"నాన్నా! పండగపూట, నిండిన ఇంట్లో మీ వంటి పెద్దలు కంట తడి పెట్టవచ్చా? అయినా మీరేం తప్పుచేశారని ఇంతగా మనస్తాప పడతారు? నా అప్ప శ్రేయస్సు నా శ్రేయస్సు కాదూ? మా బావ ఇంజనీరంటే నా కెంత గౌరవం? నేనే చెయ్యవలసివస్తే మీ మాట అక్షరాల నెరవేర్చి ఉండనా? కానివ్వండి. శుభస్య శీఘ్రం. ఇంక ఆలోచించక్కర్లేదు. ప్రతిదీ మంచికే" అన్నాడు తండ్రి యోగ్యతలు పుణికి పుచ్చుకున్న కొడుకు నరసింహం.

తెలతెలవారుతూండగా తండ్రీ కొడుకు లిద్దరూ రచ్చబండదగ్గిర చేరి తమ పొలం పాటకు పెడుతున్నట్టు దండోరా వేయించారు. పండగపూట పొలం అమ్ముకునే విడ్డూరం చూచేందుకు జనమైతే పోగైనారు గాని పదివేలు పాట విని పలికే మనిషి కరువైనాడు. చేసేది లేక పాట తగ్గించి రెండెకరాలు ఐదువేల మంచి మొదలుపెట్టారు రామయ్యగారు. ఆ ముసలి ప్రాణి ఆవేశం చూసి నలుగురూ ముక్కున వేలేసుకున్నారు. పాట మందకొడిగా సాగుతున్నది. ఏ మూల నుంచో ఏడువేలని వినిపించింది. తీరా చూస్తే నారాయణ!

"నీకేం తీపు దిగదీసిందిరా?" అని పక్కనున్న వాళ్లు తన చెయ్యి ఒత్తితే తారామండలానికి లేచి, "దగుల్బాజీ వెధవల్లారా, పొలం తేరగా దొరికింది కొట్టేద్దామనుకున్నారా, పాప మా ముసలిప్రాణం నోట మట్టికొట్టి? నా బొందిలో ప్రాణముండగా అలా జరగనివ్వను. మీరేం దిగులుపడకండి, బాబుగారూ! మీ ఉప్పు తిన్నవాణ్ణి. మిమ్మల్ని నష్టపడనివ్వను. అనుమానించకండి, ఇదుగో డబ్బు." డబ్బు మూట నలుగురి తలలమీదుగా ఎత్తిపెట్టి చూపించాడు నారాయణ తన విశ్వాసాన్ని నిరూపించుకోటానికి.

"దిగొచ్చాడయ్యా కొనటానికి డబ్బుగల మొనగాడు!" కావేషాలు పెరిగిపోయి పాట పెంచేసింది జనం.

"ఏడువేల ఐదు వందలు."

"ఎనిమిది వేలు."

"ఎనిమిదివేల మూడువందలు . . . ఐదువందలు."

"తొమ్మిదివేలు."

మళ్లీ పాట మందగించింది.

"తొమ్మిదివేల ఐదు వందలు." తెగించి చెప్పేశాడు నారాయణ మరి పాడేవాళ్ల నోళ్లు పడిపోయాయి.

"ఒకసారి, రెండుసార్లు, మూడుసార్లు." పాట నారాయణపేర కొట్టేశారు పెద్దమనుషులు.

"సమయాని కాదుకుని పరువు నిలిపావు, నారాయణా!" కృతజ్ఞత చెప్పుకున్నారు రామయ్యగారు.

"ఆమాత్రం సహాయం చేసుకోకపోతే మనిషి జన్మ ఎత్తి ఏం ప్రయోజనమండి? చేసిన మేలు మరిచిపోయే విశ్వాసఘాతుకుణ్ణి కాను, బాబుగారూ. కానైతే ఒక చిన్న మనవి" అన్నాడు నారాయణ.

"ఏమిటది? అడుగు" అన్నారు రామయ్యగారు.

"మరేంలేదు గానండి, పొలం మా బావగారి డబ్బుతో కొంటున్నాను. ఊళ్లో ధర ఎలా పలికిందో మీరు స్వయంగా చూచే ఉన్నారు గద? అందేత్త అంచేత. . ."

"అదేమిటి, నారాయణా! నీళ్లు నములుతావు? నీ భయమేమిటో అడుగు" అన్నారు రామయ్యగారు.

"చిత్తం. రేపు ఒకవేళ ధరలు పడిపోయి మా బావగారు నష్టమన్నా. . ." బుర్ర గోక్కున్నాడు నారాయణ.

"అదా సంగతి? ఆ భయం నీకే మక్కరలేదు. రాగల ఐదేళ్లలో ధరలు తగ్గేట్టయితే నీకు నా పొలం వల్ల వచ్చే నష్టానికి హామీగా నాకు మిగిలిన రెండెకరాలూ రాసి ఇస్తాను" అన్నారు రామయ్యగారు.

"హా హా! చిత్తం, వజ్రాల విలవైన మాట సెలవిచ్చారు బాబుగారు. మరి భయంలేదు. డబ్బు రెడీగానే ఉంది. రాతకోతలు పూర్తిచేసి మీ పైకం మీరు పట్టుకెళ్లచ్చు" అన్నాడు నారాయణ.

ఉభయుల సమ్మతిమీద క్రయధనం పొంతి అడ్వాన్సుగా తొమ్మిదివేలు పుచ్చుకున్నట్లు, మిగిలిన పైకం రిజిస్ట్రారువారి సమక్షంలో పుచ్చుకుని రెండు నెలలలోగా పొలం రిజిష్టరు చేసేటట్టు చేఉత్తరం రాసి ఇచ్చి, కొడుకుచేతకూడా సంతకం పెట్టించారు రామయ్యగారు.

పొలం అమ్మగా వచ్చిన తొమ్మిదివేలకు ఇంట్లో ఉన్న డబ్బు తుడిచి తెచ్చి కలపగా, మిగిలిన కొరవ భర్తీ చెయ్యమని గురవయ్య నడిగితే కిందబెట్టి మీదబెట్టి అపరాహ్ణం చేశాడా మహానుభావుడు. డబ్బెంత అవసరంగా ఇస్తే అంత పెరుగుతుంది ఇచ్చేవాడి విలవ! నాటికి గంగ ప్రాప్తి లేకపోయింది మరి రామయ్యగారికి. ఆరు మైళ్లు నడిచి వెళ్లాలి రైలుస్టేషనుకు. వియ్యంకుడి ఊరివైపు వెళ్లే బండి రెండు గంటలకు రావాలి. బళ్లు టైముకు రాకపోవటం మామూలే. వ్యవధి ఉన్నదని భార్యకు ధైర్యం చెప్పి బయల్దేరారు రామయ్యగారు. పైకం భద్రపరిచిన పంచి చంకనబెట్టుకుని. ఊరు సివారుదాకా వచ్చి, "భద్రం, నాన్నా, అక్కయ్యను బావను తప్పక తీసుకురండి" అని హెచ్చరించి తిరిగి వెళ్లాడు నరసింహం.

ఆజానుబాహువేమో చకచకా నడుస్తున్నారు రామయ్యగారు, జరిగిన సంగతులు నెమరువేసుకుంటూ. స్టేషను చేరుకునేసరికి రెండో గంట కొట్టారు. బండి టైముకి వచ్చింది. టిక్కెట్టు తీసుకుని ప్లాటుఫారంమీద పరుగెత్తి ఎక్కబోతే ఖాళీ దొరక లేదు. బండి ఎక్కువసేపు ఆగదు ఆ చిన్న స్టేషన్లో. నాలుగు పెట్టెలు దాటి ముందుకు పరిగెత్తి వాకిలి కమ్మి పట్టుకున్నారు, ముందుచూపేగాని వెనకచూపు లేని రామయ్యగారు. చెవులు గడియలు పడేట్టు కెవ్వుమని ఇంజను గుంయి మనటమేమిటి, రామయ్యగారు చంక బరువు తగ్గి వెనక్కి చూడటమేమిటి ఒకసారే జరిగాయి. "దొంగ. . . దొంగ" అని కేకవేస్తుండగా ఇంజను కుదుపుకు బండి ముందుకు జరిగింది. ఫుట్ బోర్డుమీద కాలు జారి, చెయ్యి పట్టుతప్పి శరీరం వెనక్కి ఒరిగింది. అంతే! నాటికీ నేటికీ ఎప్పటికీ ఋణగ్రస్తుడే రామయ్యగారు! ★

# సౌమ్యం

—o—

కాలోదధి లోంచి ఒక అల
ఉవ్వెత్తుగా లేచి...సంరంభంచేసి
మళ్ళీ ఆ కడలిలో కలిసిపోయింది
మరో ఉదంచితోల్లోలం
సంభూతమై
భూమ్యుపరితలంలో ...
ఈ మహాప్రపంచంలో ...
ఒక మారుమూల .... మనమధ్యకు
తెలుగు ప్రజానీకం మధ్యకు
"సౌమ్యం"గా వస్తోంది!...
ఈ సౌమ్యం ఇల్లాగే నిలిచి—
ఇంతవరకూ వెనుకకు నెట్టిన
ధ్వాంత పూరిత గతాన్ని
తిరిగి తలయెత్తకుండా ....
నేత్ర పర్వంగా ... దివ్యప్రభలని
వ్యాపింపజేస్తే ! ....
ఈ నవ్య వర్షం సంఖ్యేయమై
మన హృదయాలలో
మధురంగా నిలిచిపోతే ! ! ...

—వి. సంపత్కుమారాచార్య